క్లుప్తంగా

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో పాల్గొన్న పలువురు ఉభయదాతలు

డాబాగార్డెన్స్: నగరంలోని బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

23న సహస్ర తులసిపూజ

కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 23న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఈవో శిరీష తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆమె పేర్కొన్నారు.

కేజీహెచ్‌లో దంత పరీక్షలు



శిబిరంలో పాల్గొన్న సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్‌కుమార్, ఇతర వైద్యులు

మహారాణిపేట : ప్రపంచ దంత పరిరక్షణ దినోత్సవం సందర్భంగా మంగళవారం కేజీహెచ్‌లో దంత పరీక్షలు నిర్వహించారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ శిబిరాన్ని ప్రారంభించారు. 400 మంది కేజీహెచ్ నాల్గవ తరగతి, పొరుగు సేవల సిబ్బందికి, 200 మంది సాధారణ ఓపీ రోగులకు నోటి క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేశారు. వీరిలో 8 మందికి నోటి క్యాన్సర్ నిర్ధారణ అయిందని దంత విభాగాధిపతి డాక్టర్ త్రివేణి తెలిపారు. రోగులకు అవసరమైన టూత్ పేస్టులు, చిగుర్ల వ్యాధి నివారణకు అవసరమైన లేపనాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కేజీహెచ్ ఏఆర్ఎంవో డాక్టర్ అరుణాదేవి, డాక్టర్ జగదీష్‌కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్‌కుమార్, దంత వైద్యులు డాక్టర్ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

యోగాలో ఏఎంహెచ్‌వో కిశోర్‌కు అవార్డు



అవార్డు అందుకుంటున్న ఏఎంహెచ్‌వో కిశోర్

జగదాంబ: యోగాలో జీవీఎంసీ జోన్–4 ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.కిశోర్ అవార్డు సాధించారు. ఇంటర్నేషనల్ యోగా దినోత్సవం సందర్భంగా సాగర్‌నగర్, సెంట్రల్ పార్కు, వుడా, ఆర్‌కే బీచ్‌లో జీవీఎంసీ ఆధ్వర్యంలో యోగా కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిలో జీవీఎంసీ జోన్–4 ఏఎంహెచ్‌వో కూడా ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీసీ డాక్టర్ సన్యాసిరావు, జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

పూర్ణామార్కెట్‌కు ఉగాది శోభ



సామగ్రి కొనుగోలు చేస్తున్న వినియోగదారుడు

జగదాంబ: పూర్ణామార్కెట్ ఉగాది శోభ సంతరించుకుంది. పచ్చడికి కావల్సిన మామిడికాయలు, వేపపువ్వు, మామిడి పత్రులు, బెల్లం, పువ్వులు, పసుపు, కుంకుమలు తదితర ద్రవ్యాల కొనుగోలుకు జనం తరలి వచ్చారు. పూర్ణామార్కెట్ ప్రాంతమంతా కొనుగోలుదారులతో రద్దీగా కనిపించింది. పండగ వేళ ధరలు అధికంగా ఉండడంతో సామాన్యులు నిట్టూరుస్తూనే పూజా సామగ్రి కొనుగోలు చేశారు.

జయహో



సీఎంఆర్-జీవీఎంసీ హైస్కూల్ (ప్రకాశరావుపేట)

- ప్రభుత్వానికి మంచి పేరు తీసుకొస్తాం
- పది పరీక్షలు రాయనున్న గవర్నమెంట్ స్కూళ్ల విద్యార్థులు



ఎంవీడీఎం హైస్కూల్ (దండుబజార్)

డాబాగార్డెన్స్: పదో తరగతి పరీక్షల్లో అత్యధిక గ్రేడ్ పాయింట్లు సాధించి సత్తా చాటుతామని జీవీఎంసీ, ప్రభుత్వ క్వీన్ మేరీ పాఠశాల విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో చెబుతున్నారు. దక్షిణ నియోజకవర్గ పరిధిలో గల జీవీఎంసీ, ప్రభుత్వ క్వీన్‌మేరీ పాఠశాల నుంచి 602 మంది విద్యార్థులు ఈ ఏడాది పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్నారు. సీఎంఆర్–జీవీఎంసీ పాఠశాల నుంచి 74 మంది విద్యార్థులు పరీక్షకు వెళ్తున్నారు. వీరిలో 27 మంది బాలురు, 47 మంది బాలికలు ఉన్నారు. వీరంతా 12 కేంద్రాల్లో పరీక్షలు రాయనున్నారు. ఎంవీడీ హైస్కూల్ (దండుబజార్) నుంచి మొత్తంగా 102 మంది విద్యార్థుల్లో 60 మంది బాలురు, 42 మంది బాలికలు 10 కేంద్రాల్లో పరీక్షలు రాయనున్నారు. జీవీఎంసీ ఎంవీడీఎం హైస్కూల్ (లక్ష్మీటాకీస్) నుంచి పరీక్షకు హాజరు కానున్న 96 మంది విద్యార్థుల్లో 62 మంది బాలురు, 24 మంది బాలికలు 10 కేంద్రాల్లో పరీక్షలు రాయనున్నారు. మహాత్మాగాంధీ మున్సిపల్ హైస్కూల్ (ఎంజీఎం) నుంచి 110 మంది విద్యార్థులు ఈ ఏడాది పదో తరగతి పరీక్షలు రాయనున్నారు. వీరిలో 66 మంది బాలురు, 44 మంది బాలికలు ఉన్నారు. ఇక ప్రభుత్వ క్వీన్ మేరీ పాఠశాల నుంచి అత్యధిక సంఖ్యలో 220 మంది బాలికలు పదో తరగతి పరీక్షలకు సిద్ధమయ్యారు. వీరంతా 14 కేంద్రాల్లో పరీక్షలు రాయనున్నారు.

టాప్ లేపుతారట..

జీవీఎంసీ, ప్రభుత్వ క్వీన్ మేరీ పాఠశాలల (సర్కార్ బడులు) నుంచి పదో తరగతి పరీక్షలకు వెళ్తున్న బాల బాలికలు ఈ సారి సత్తా చాటుతామంటున్నారు. ప్రభుత్వం అన్ని మౌలిక సదుపాయాలు కల్పించింది. పుస్తకాలు ఉచితంగా అందజేసింది. అమ్మఒడి అంటూ మాకు డబ్బులు వేసింది. ఇలా అన్ని సదుపాయాలు కల్పించిన ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చిపెడతామని.. సర్కార్ బడుల్లో విద్య బాగుంటుందని సత్తా చాటి చూపిస్తామంటున్నారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా సర్కార్ బడుల్లో విద్య బాగుంటుందని రుజువు చేస్తామంటున్నారు.

మంచి మార్కులతో ఉత్తీర్ణతే మా ధ్యేయం..



ప్రభుత్వం కల్పించిన అన్ని సదుపాయాలు.. విద్యావ్యవస్థకు ఇచ్చిన ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకుని పిల్లలు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలన్నదే మా ధ్యేయం. పిల్లల్లో సృజనాత్మకత బాగా పెరిగింది. అందుకు ఉపాధ్యాయుల కృషే కారణం. ప్రతి ఒక్క విద్యార్థిపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి పెట్టి అత్యధిక గ్రేడ్ పాయింట్లు సాధించేలా ఉదయం.. మధ్యాహ్నం.. సాయంత్రం మంచి తర్ఫీదు ఇస్తున్నారు.

– శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయుడు, సీఎంఆర్–జీవీఎంసీ పాఠశాల

కాంట్రాక్టర్‌కు ఫిర్యాదు చేయండి

- రహదారి సమస్య పరిష్కరించాలన్న బాధితులకు జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారుల సలహా



శిథిలమైన రహదారి

డాబాగార్డెన్స్: జీవీఎంసీ పరిధిలో ఎక్కడ ఏ సమస్య వచ్చినా.. స్థానిక సచివాలయానికి వెళతారు. లేదంటే జీవీఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్తారు. కానీ అధికారులే కాంట్రాక్టర్లకు చెప్పుకోండంటూ సూచనలిస్తున్నారు. పన్నుల రూపంలో జీవీఎంసీకి చెల్లించాలి. ప్రజా సమస్యలపై కాంట్రాక్టర్ల వద్దకు వెళ్లాలట.. ఇదీ జీవీఎంసీ అధికారుల పని తీరు. వివరాల్లోకి వెళ్తే.. నగరంలోని జోన్–4 పరిధి 28వ వార్డు రాక్‌డేల్ లేఅవుట్, ఆర్థోడాక్స్ చర్చి (అపోలో ఆస్పత్రి అప్‌రోడ్డు) ఏరియాలో ఫుట్‌పాత్ మరమ్మతులు/డ్రైనేజీ పనుల కోసం 4 నెలల కిందట తవ్వేసారు. పనులు పూర్తి కాకపోవడంతో ఆ రహదారిని ఉపయోగించే పలువురు అపార్టుమెంట్ వాసులు స్థానిక సచివాలయ సిబ్బందికి పలుమార్లు చెప్పినా సమస్య పరిష్కారం కాలేదు. దీంతో ఆ అపార్టుమెంట్ వాసులు ఇంజనీరింగ్ అధికారులను కలిసారు. ఇదిగో.. అదిగో.. అంటూ 4 నెలలు గడిపేసారు. సమస్య పరిష్కారం కాకపోగా.. ఫిర్యాదు చేసిన వ్యక్తికి ఆ ఇంజనీరింగ్ అధికారి సలహా ఇచ్చారట. అదేంటంటే.. మీరు కాంట్రాక్టర్‌కు చెప్పుకోండని. అంటే ప్రజా సమస్యను పరిష్కరించాల్సిన అధికారులే కాంట్రాక్టర్ల వద్ద మొరపెట్టుకోమంటున్నారంటే అధికారులు ఏ స్థాయిలో ఉన్నారో ఇట్టే తెలుస్తోంది. చివరకు ఆ అపార్టుమెంట్ వాసులు మీడియాను ఆశ్రయించాల్సి వచ్చింది. ఇదిలా ఉండగా.. ఆ అపార్టుమెంట్‌లో నివాసం ఉంటున్న ఓ పెద్దాయన కింద పడి మంచం పట్టాడు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

ప్రతి ఒక్కరికీ శుభం జరగాలి



అదనపు కమిషనర్‌ను సత్కరిస్తున్న బ్రహ్మకుమారీస్, వీజేఎఫ్ బృందం

డాబాగార్డెన్స్: షడ్రుచుల ఉగాదితో ప్రారంభమయ్యే శోభకృత్ సంవత్సరంలో ఇంటింటా ఆయురారోగ్యాలు, సిరిసంపదలు, ఆనందాలు నిండాలని జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ వై. శ్రీనివాసరావు ఆకాంక్షించారు. ప్రజాపిత బ్రహ్మకుమారీస్, వీజేఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో ఉగాది శోభకృత నామ సంవత్సర ఉత్సవాలు మంగళవారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న శ్రీనివాసరావు మాట్లాడుతూ అందరికీ మంచి జరగాలని అభిలషించారు. బ్రహ్మకుమారి రామేశ్వరి మాట్లాడుతూ సమాజ పరివర్తనకు ఇటువంటి పండగలు దోహదపడతాయన్నారు. వీజేఎఫ్ అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ సమాజానికి సేవలందించే మీడియా మిత్రులు సంతోషంగా ఉండాని, ఈ ఉగాది నుంచి అందరికీ అంతా బాగుండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పలువురు పాత్రికేయలకు ఉగాది కిట్లు అందజేశారు. అదనపు కమిషనర్ శ్రీనివాసరావును సత్కరించారు. కార్యక్రమంలో నాగరాజ్ పట్నాయక్, దాడి రవికుమార్, ఎంఎస్ఆర్ ప్రసాద్, ఈశ్వరరావు, బ్రహ్మకుమారి సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

నూకాంబిక అమ్మవారికి ఘనంగా పూజలు



విశేష అలంకరణలో నేతాజీనగర్ నూకాంబిక అమ్మవారు



రామకృష్ణ జంక్షన్‌లో నూకాంబిక అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

అల్లిపురం: కొత్త అమావాస్య సందర్భంగా అల్లిపురం, కొబ్బరితోట, నేతాజీనగర్, రామకృష్ణ జంక్షన్, ఏడుగుళ్ల స్లమ్‌లో గల నూకాంబిక అమ్మవారి దేవాలయాల వద్ద జాతర మహోత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. అమ్మవారికి విశేష పూజలు చేసి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఈ మేరకు ఆయా దేవాలయాల ఉత్సవ కమిటీలు భక్తుల సౌకర్యార్థం తగిన ఏర్పాట్లు చేపట్టాయి. సాయంత్రం దేవాలయాల వద్ద అమ్మవారి మాలధారులు అగ్నిగుండ ప్రవేశం చేశారు. డప్పు వాయిద్యాలు, తప్పెటగుళ్లు, సాము గరిడీల మధ్య అమ్మవారికి ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

డిజిటల్ లావాదేవీలపై విద్యార్థులకు అవగాహన

మహారాణిపేట : మంగళవారం డాక్టర్ బుల్లయ్య కళాశాలలో విద్యార్థులకు డిజిటల్ లావాదేవీల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. రెండు కిలోమీటర్ల నడక పోటీలు ఈనెల 27న జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వ్యవస్థాపక దినోత్సవం

డాబాగార్డెన్స్: బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ వ్యవస్థాపక దినోత్సవం మంగళవారం కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరం చేపట్టారు. అనంతరం యూనియన్ నాయకులు మాట్లాడుతూ బీఎస్ఎన్ఎల్‌కు 4జి వెంటనే ఇవ్వాలని, వేజ్ రివిజన్, పెన్షన్ రివిజన్ జరగాలని, బీఎస్ఎన్ఎల్ టవర్స్ ప్రైవేట్‌కు ధారాదత్తం చేయరాదని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సాగర్, డీజీఎంలు జగదీశ్వరరావు, సత్యప్రసాద్, నాయకులు ఎస్. సురేష్‌కుమార్, పి. లచ్చిరాజు, ఏడుకొండలు, మీనాకుమారి, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

న్యాయ సేవలు అందరికీ చేరువ కావాలి



ప్రసంగిస్తున్న న్యాయమూర్తి బులికృష్ణ

విశాఖ లీగల్: న్యాయసేవా ప్రాధికార సంస్థ సేవలను ప్రజలందరికీ విస్తరించాలని లోక్ అదాలత్ జిల్లా కార్యదర్శి కేకేవీ బులికృష్ణ అన్నారు. మంగళవారం సాయంత్రం జిల్లా కోర్టులోని లోక్ అదాలత్ భవనంలో వివిధ సేవా సంస్థల ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. ప్రస్తుతం లోక్ అదాలత్ అందిస్తున్న సేవలను, సేవా సంస్థల పనితీరును సమీక్షించారు. భారత రాజ్యాంగం, జస్టిస్ కృష్ణయ్య ఆకాంక్షల మేరకు ఏ వ్యక్తి న్యాయ సహాయానికి దూరం కాకూడదన్న లక్ష్యాన్ని సాకారం చేయాలన్నారు. కార్యక్రమంలో ధాత్రి ఫౌండేషన్ అధ్యక్షురాలు సీహెచ్ విశాలాక్షి, వినియోగదారుల ప్రొటెక్షన్ కౌన్సిల్ అధ్యక్షుడు పి.కె. లింగేశ్వరరావు, ఎల్డర్‌లైన్ ప్రతినిధి ప్రసాద్, నేచర్ సంస్థ, ఏఎస్‌కె ఫౌండేషన్, లోక్ అదాలత్ ప్యానల్ అడ్వకేట్‌లు పాల్గొన్నారు.

మిల్లెట్స్‌పై వర్క్‌షాప్



ప్రదర్శనను తిలకిస్తున్న విద్యార్థులు, అతిథులు

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో బయో టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో మజీదార్ మిల్లెట్స్‌పై వర్క్‌షాప్ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ నేతృత్వంలో జరిగిన వర్క్‌షాప్‌ను ఆచార్యులు డాక్టర్ వై.లక్ష్మీప్రభ, డాక్టర్ మాణిక్య కుమారి ప్రారంభించారు. వర్క్‌షాప్‌లో విద్యార్థులకు నర్సరీ ద్వారా చిరు ధాన్యాల ఉత్పత్తి, వాటితో తయారు చేయగలిగిన వంటకాల ప్రాముఖ్యతను వివరించారు. సిస్టర్ మేరీ, డాక్టర్ అరుణదేవి, డాక్టర్ పీకే జయలక్ష్మి పాల్గొన్నారు.

లాడ్జిలో యువకుడి ఆత్మహత్య

అల్లిపురం: లాడ్జిలో యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. టూటౌన్ సీఐ తిరుమలరావు తెలిపిన వివరాల ప్రకారం గాజువాకలోని ములగాడ, హౌసింగ్‌బోర్డు కాలనీకి చెందిన బిరుసు రాజేష్‌కుమార్ (28) బీటెక్ చదువుకున్నాడు. అమెజాన్ (హైదరాబాద్)లో కొంత కాలం పని చేసి మానేశాడు. విలాసాలకు అలవాటు పడ్డ రాజేష్‌కుమార్ మద్యానికి బానిసగా మారాడు. మృతుడి తండ్రి మాజీ ఆర్మీ ఉద్యోగి. ఆయన ప్రస్తుతం ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌లో సెక్యూరిటీ ఉద్యోగం చేస్తున్నాడు. తండ్రిని ఖర్చుల కోసం ఇటీవల రాజేష్‌కుమార్ డబ్బులు అడిగాడు. అతను లేవనడంతో మనస్తాపంతో ఈ నెల 15వ తేదీన సూర్యాబాగ్‌లో గల రాఘవేంద్ర లాడ్జిలో గది అద్దెకు తీసుకున్నాడు. అయితే రెండు రోజుల నుంచి అతను లాడ్జి గది నుంచి బయటికి రాలేదు. తలుపులు కూడా తెరవలేదు. మంగళవారం ఉదయం గది నుంచి దుర్వాసన రావటంతో గది తలుపులు తెరిచిన సిబ్బందికి గదిలో రాజేష్‌కుమార్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించాడు. దీంతో వారు టూటౌన్ పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న సీఐ తిరుమలరావు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా ప్రపంచ అటవీ దినోత్సవం

అల్లిపురం: విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాలలో కళాశాల వృక్ష విభాగం, గ్రీన్‌క్లబ్, ఎన్ఎస్ఎస్ యూనిట్లు సంయుక్తంగా మంగళవారం ప్రపంచ అటవీ దినోత్సవం నిర్వహించాయి. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్, జోన్–1 రీజనల్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.శోభారాణి కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో వృక్ష విభాగాధిపతి డాక్టర్ ఏహెచ్‌డీ పుష్పలత, అధ్యాపకులు జె. లావణ్య, ఫిజిక్స్ డైరెక్టర్ డాక్టర్ ఇ.కిరణ్మయి, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

ఆరోగ్యానికి తోవ.. రాగిజావ

- బడి పిల్లలకు జగన్ మామయ్య కానుక
- పిల్లల్లో పౌష్టికాహార లోపానికి సులువుగా చెక్



ఎంజీఎం హై స్కూల్లో విద్యార్థులకు రాగిజావ అందజేస్తున్న రంథి గోపి, కర్రి నీలకంఠం, హెచ్ఎం నాగభూషణం



మోడల్ స్కూల్లో విద్యార్థులకు రాగిజావ అందజేస్తున్న హెచ్ఎం కనకమహాలక్ష్మి



సెయింట్ ఆంతోనీ పాఠశాల విద్యార్థులకు రాగి జావ పంపిణీ



రెల్లివీధి జీవీఎంసీ పాఠశాలలో రాగిజావ పంపిణీ చేస్తున్న చెన్నా జానకీరామ్



ప్రభుత్వ క్వీన్‌మేరీ పాఠశాలలో పిల్లలకు రాగిజావ పంపిణీ చేస్తున్న సాధిక్

అల్లిపురం: బడిపిల్లలకు గోరుముద్దలో భాగంగా రాగిమాల్ట్, బెల్లం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందింబారని 33వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు రంథి గోపీకృష్ణ అన్నారు. డాబాగార్డెన్స్‌లో గల మహాత్మాగాంధీ మున్సిపల్ హై స్కూల్లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయన విద్యార్థులకు రాగిజావ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల అభివృద్ధి, ఆరోగ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక చర్యలు తీసుకుందన్నారు. పోషకాహార లోపంతో బాధపడుతున్న విద్యార్థులందరికీ ఇది మేలు చేస్తుందన్నారు. విద్యార్థులు రాగిజావ తీసుకుని ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలని అన్నారు. పార్టీ వార్డు ఇన్‌చార్జి కర్రి నీలకంఠం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందించిన ఈ సదవకాశాన్ని ప్రతి విద్యార్థి వినియోగించుకోవాలని కోరారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్‌వీవీఎస్ నాగభూషణం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దాదాపు రూ.90 కోట్లు ఖర్చు చేసి విద్యార్థులకు పౌష్టికాహారమైన రాగి జావ అందజేయడం శుభ పరిణామమన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్లో..

అల్లిపురం మెయిన్‌రోడ్డులో గల జీవీఎంసీ మోడల్ స్కూల్లో మంగళవారం రాగి జావ పంపిణీ కార్యక్రమాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కనకమహాలక్ష్మి ప్రారంభించారు. విద్యార్థులకు దగ్గరుండి అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం మంచి కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు. రాగిజావ, బెల్లంముక్క అందజేయడం వలన విద్యార్థులకు పౌష్టికాహారం అందుతుందన్నారు.

నిరుపేద విద్యార్థులకు పోషకాహారం..

డాబాగార్డెన్స్: నిరుపేద విద్యార్థులకు కార్పొరేట్ విద్య అందించటంతో పాటు, వారిని ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి శ్రమిస్తున్నారని 37వ వార్డు కార్పొరేటర్ చెన్నా జానకీరామ్ అన్నారు. వార్డు పరిధి రెల్లివీధి జీవీఎంసీ పాఠశాల వద్ద జగనన్న గోరుముద్ద కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయురాలు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాగిజావతో రక్తహీనతకు చెక్..

నగరంలోని మహారాణిపేటలో గల సెయింట్ ఆంతోనీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రాగి జావ పంపిణీ కార్యక్రమాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అప్పలనాయుడు ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం రక్తహీనతకు చెక్ పెట్టేందుకు విద్యార్థులకు వారంలో మూడు రోజులు ఉదయం వేళల్లో రాగిజావ అందజేయనున్నట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు థాంక్యూ జగన్ మామ అంటూ నినదించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సంజీవకుమార్, ఆంతోనీపాల్, రోహిణి, విజయ్‌కుమార్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రభుత్వ క్వీన్‌మేరీ పాఠశాలలో..

ప్రభుత్వ క్వీన్‌మేరీ, జీవీఎంసీ ఎంవీడీఎం(లక్ష్మీటాకీస్) హైస్కూల్లో 39వ వార్డు కార్పొరేటర్ మహ్మద్ సాధిక్ పాఠశాల పిల్లలకు రాగిజావ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, వార్డు నాయకులు పాల్గొన్నారు.

మంచి కార్యక్రమం



రాగిజావ, బెల్లం అందజేయడం వలన విద్యార్థులకు ఐరన్ పుష్కలంగా అందుతుంది. అదే విధంగా జగనన్న గోరుముద్ద ద్వారా వారం రోజుల పాటు వివిధ రకాల మెనూతో పౌష్టికాహారం ఇస్తున్నాం. ఇది విద్యార్థులకు ఎంతో ఉపయోగకరం.

–కనకమహాలక్ష్మి, ప్రధానోపాధ్యాయురాలు, అల్లిపురం మోడల్ స్కూల్

చాలా బాగుంది..



రాగిజావ చాలా బాగుంది. గ్లాసుడు రాగిజావతో కడుపు నిండిపోయింది. చాలా రుచిగా కూడా ఉంది.

–ప్రణవి, విద్యార్థిని

మరికొంత ఉంటే బాగుండును



రాగిజావ చాలా నచ్చింది. మరికొంత ఉంటే తాగాలనిపించింది. రాగిజావతో పాటు మాకు బెల్లం ముక్క కూడా ఇచ్చారు.

–వైష్ణవి, విద్యార్థిని